క్లుప్తంగా

శభాష్ కండక్టర్



కోడేరు: కొల్లాపూర్ నుంచి కోడేరు, హైదరాబాద్ వెళ్లే బస్సు కండక్టర్ మహ్మద్ ఉస్సేన్ ప్రయాణికుల కోసం శనివారం బస్సు సీట్లను టవాల్‌తో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీగలపల్లి నుంచి నాగపూర్ వరకు రోడ్డు బాగా లేకపోవడంతో బస్సులో సీట్లకు దుమ్ము చేరిందన్నారు. అయితే హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు సీట్లకు దుమ్ము ఉందని ఎక్కి దిగుతున్నారని, దీంతో సీట్లను శుభ్రం చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు బస్సును శుభ్రం చేయడంతో కండక్టర్‌ను అభినందించారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



తాడూరు: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలని స్థానిక పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ అన్నారు. శనివారం విద్యార్థులకు నిర్వహించిన ఆంగ్ల పదజాలం పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు సి.నిరంజన్, ఉపాధ్యాయులు వెంకటయ్య, ప్రవీణ్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ పావని తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



అచ్చంపేట రూరల్: నిషేధిత నాటు సారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఉదయం మండలంలోని పులిజాల రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉప్పునుంతల మండలం దేవదారికుంటకు చెందిన లోక్య నాటు సారా తరలిస్తూ పట్టుబడ్డాడు. సుమారు 10లీటర్ల నాటు సారాను అచ్చంపేటకు తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్య ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రకాష్, బాలయ్య, ఆసిఫ్ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు రూ.15 వేల విలువగల ప్రింటర్ జిరాక్స్ మిషన్‌ను శనివారం అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పుష్పలత–యాదగిరి, ఉమాదేవి–కుమారస్వామి దంపతుల సహకారంతో ప్రింటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రతి ఒక్కరు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్యగౌడ్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మఅంజియాదవ్, ఉపసర్పంచ్ అనంతరెడ్డి, ఆంజనేయులు, దారమోని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్



కల్వకుర్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను వెంటనే పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మల్లయ్య, జగన్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఉన్న ప్రతి కుటుంబానికి రూ.3 లక్షలు ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్: స్థలం ఉన్న ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్రూం నిమిత్తం రూ.3 లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్దం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని, ఎన్నికల ముందు చెప్పారని అన్నారు. లేని సమక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



పెంట్లవెల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



ఎల్లికట్టలో చెన్నకేశవస్వామి కళ్యాణం

కల్వకుర్తిరూరల్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని ఎల్లికట్టలో లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణమహోత్సవం, సర్పంచ్ రమాదేవి సహకారంతో అన్నదానం నిర్వహించారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకల్లో భాగంగా విశ్వ హిందు పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో రుక్మిణి సత్యభామల చిత్ర పటాలకు ఆలయ పూజారి నర్సింహశాస్త్రీ సమక్షంలో అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. విశ్వహిందు పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంతో పాటు మండలంలోని పలు దేవాలయాల్లో రథ సప్తమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులతో సూర్య నమస్కారాల ప్రదర్శన నిర్వహించారు.

లింగాల: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం ఆలయ 10వ వార్షికోత్సవం, రథసప్తమి సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు.

ఊరుకొండపేటలో పూజలు..

కల్వకుర్తి: ఊరుకొండపేట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం విద్యాకమిటీ చైర్మన్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో రథసప్తమి పండుగను పురస్కరించుకొని శనివారం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం గౌరి పూజ, గణపతి పూజ, అభిషేకం, సింధూరలేపనం, ఆకుపూజ పూజలను ఘనంగా నిర్వహించారు.



ఉప్పునుంతలలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



ఊరుకొండపేటలో..



అచ్చంపేట సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థుల సూర్య నమస్కారాలు

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్టకి చెందిన సంగనమోని సంధ్య, శివయ్య వారికి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి నిధుల నుంచి మంజూరైన రూ.15 వేలను కొల్లాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ విజయ్‌కుమార్ అందజేశారు. నాయకులు నరేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఉప్పునుంతల: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదేశాల మేరకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వార మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ కట్టా గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీను, కుర్మయ్య, మల్లయ్య, ఎల్లయ్యయాదవ్, జంగయ్య, సుధాకర్, బాలస్వామి,గణేష్, రామచంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి కుమారస్వామి

కల్వకుర్తి: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయమూర్తి కుమారస్వామి సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కుమారస్వామి పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 11న నిర్వహించే లోక్ అదాలత్‌పై పోలీస్ సిబ్బందితో న్యాయమూర్తి చర్చించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి స్వరూప, న్యాయవాదులు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరపాలి

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా జరపాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ ఎంఎల్‌సీ అభ్యర్థి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలో పలువురు ఉపాధ్యాయులను కలిసి మద్దతు అడిగారు. తెలంగాణ ఉద్యమంలో టీయూటీఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన ప్రకటించారు. మహాత్మా జ్యోతీరావుపూలే బాలికల కళాశాల, సోషల్‌వెల్ఫేర్ బాలికల పాఠశాల తాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూపల్లి, చారకొండ మండలాల పరిధిలోని పాఠశాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రవీందర్, శైలం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



లింగాల: మండల పరిధిలోని చెన్నంపల్లికి చెందిన బీజేపీ బూత్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ ఇటీవల విద్యుదాఘాతంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ నాయకులు సతీష్‌మాదిగ శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు రూ.5 వేల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు. కార్య క్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రేణయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, సలేశ్వరం, విష్ణు, సైదులు, అశోక్, కృష్ణయ్య, కార్తీక్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సూర్యభగవానుడి కల్యాణం

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో సూర్యదేవాలయ ఆలయ ఆవరణలో మళయాళస్వామి ఆధ్వర్యంలో సూర్యనారాయణస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఈ మేరకు స్వామివారికి ఉదయం పారాయణం, అభిషేకం, ఛాయాదేవి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోత్సవాల నడుమ సూర్యనారాయణ ఛాయదేవి కల్యాణోత్సవం సాగింది. ఈ మేరకు భక్తులకు అన్ని రకాల వసతులతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూచకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున వేదపండితులు

ఎమ్మెల్యే పరామర్శ

బిజినేపల్లి: మండలంలోని కిమ్యాతండాకు చెందిన ఆంగోత్ కృష్ణనాయక్‌కు శుక్రవారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శనివారం బాధితులను ఓదార్చారు. కృష్ణ మృతి తీరని లోటని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సర్పంచ్ అంజిని, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు.

ఎల్లో మిర్చి సాగుతో లాభాలు



ఎల్లో మిర్చి పంటను పరిశీలిస్తున్న విద్యార్థులు

బిజినేపల్లి: ఎర్ర మిర్చితో పోలిస్తే పసుపు పచ్చ (ఎల్లో)మిర్చిలో లాభాలు ఎక్కువగా ఉంటాయని, కావున రైతులు వినూత్నంగా ఆలోచించి పంటలను సాగు చేయాలని రావేఫ్ విద్యార్థులు అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో సురేందర్ రెడ్డి రైతుకు చెందిన మిర్చి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రావేఫ్ విద్యార్థులు మాట్లాడుతూ ఎర్ర మిర్చి కంటే పసుపు పచ్చ మిర్చిలో విటమిన్ సి ఎక్కువ ఉండడంతో పాటు మృదువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, రావేఫ్ విద్యార్థులు హారిక, మెహారాజ్, శిరీష, శ్రీసంధ్య, భవ్య, పవిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరినాట్లపై అవగాహన

తెలకపల్లి: వరినాటే విధానంపై రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని కార్వంగలో పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు రైతు భాస్కర్‌రెడ్డి పొలంలో వరిపంటలో వరి కొనలు తుంచడం, వరి వేర్లు తడిపి నాటే పద్ధతులపై వివరించారు. వరి కొనలు తుంచడంతో కొనలో కాండం తొలిచే పురుగు గుడ్లను తొలగించడం ద్వార పంట త్వరగా పెరిగి పంట తొలి దశలో కాండం తొలిచే పురుగు రాకుండ నివారించుకొని పంటను కాపాడుకోవచ్చన్నారు. వరి వేర్లను తడపడంలో క్లోరోఫైరిపాస్ ఎకరాకు 80 మి.లీ.లను 40 లీటర్ల నీటిలో కలిపి ఆ ద్రవంలో వరినారును 15 నుంచి 20 నిమిషాలు ఉంచి నాటడంతో ఉల్లిపోడు పురుగును నివారించవచ్చని సూచించారు. రైతులు విత్తనాలు విత్తుకునే ముందు సాగు చేసే పద్ధతులు, పురుగు మందులు పిచికారీ చేసే పద్ధతులపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు పూజ, శరణ్య, వైభవి, జైనాబు, రైతులు రమణారెడ్డి, ఆనంద్, శైలమ్మ, పుష్ప పాల్గొన్నారు.

కళాశాల నిర్వహణ జాప్యంపై వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కందనూలు: ఐదేళ్ల క్రితం పెద్దకొత్తపల్లి మండలానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణపై ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు భీమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ టీఆర్‌ఎస్ పాలనలో బడుల కన్నా బార్లకే ప్రాధాన్యత ఎక్కువగా ఉందని విమర్శించారు. జిల్లాలోనే వెనకబడిన పెద్ద కొత్తపల్లి మండల కేంద్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మంజూరైన ప్రభుత్వ కళాశాలలో తరగతులు ప్రారంభించేలా చొరవచూపాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి జిల్లా కార్యదర్శి వెంకటయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్ చంద్ర కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి శేఖర్ గౌడ్, జిల్లా మహిళా మోర్చా బత్తుల శిరీఖ, మహేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఘన సన్మానం



వెల్దండలో ఎమ్మెల్యే ఈటలను సన్మానిస్తున్న మత్స్యశాఖ నాయకులు

వెల్దండ: స్థానిక మండల కేంద్రంలో మత్స్యశాఖ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుంచి నల్గొండ జిల్లా డిండి మండలంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన వెల్దండలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఐక్యంగా హక్కులను సాధనకు పోరాటం చేయాలన్నారు.కార్యక్రమంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి, బీజేపీ మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, మత్స్యశాఖ మండల అధ్యక్షుడు మల్లేష్, లింగం ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, కాసరపు వెంకటయ్య, మల్లయ్య, శ్రీశైలం, మహేష్ ఉన్నారు.

ఘనంగా లాలా లజపతిరాయ్ జయంతి



గ్రీన్‌డేలో విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

దోమలపెంట(అచ్చంపేట): టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో ఈగలపెంటలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాలలో శనివారం లాలా లజపతిరాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ లజపతిరాయ్ న్యూఢిల్లీలో డీఏవీ కాలేజీ మేనేజ్‌మెంట్ కమిటీ స్థాపనలో ఆయన పాత్ర ఉందన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను ఆయన స్థాపించారని, స్వాతంత్ర్యానికి పూర్వమే ఆయన విద్య, ప్రజల సామాజిక భద్రతపై ఆలోచన చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఒకటో తరగతి విద్యార్థులు గ్రీన్ డేను నిర్వహించి సేవ్ ఎర్త్, సేవ్ ట్రీస్, సేవ్స్ లైఫ్స్‌ని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యమైంది. శనివారం తండ్రి ఫిర్యాదు మేరకు సిద్దాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన విద్యార్థిని నల్లగొండ జిల్లా డిండిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. రోజు మాదిరిగానే ఈనెల 24న ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో శనివారం సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మండలంలోని గుంపన్‌పల్లికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లికి చెందిన కమ్మరి బాలస్వామి మృతి చెందడంతో బాధిత కుటుంబానికి శనివారం మాజీ సింగిల్ విండో చైర్మన్ జమ్ముల బుచ్చారెడ్డి 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలస్వామి, మాజీ ఎంపీటీసీ తాళ్ల రాములు, హన్మంతురెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ అర్జునయ్య, బాలయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'కంటి వెలుగు'



తాడూరు: మండల కేంద్రంతోపాటు గుంతకోడూరు ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ గంగామోహన్ పరిశీలించి పరీక్ష కేంద్రానికి వచ్చే వారందరికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆదేవిధంగా పరీక్ష నిర్వహించుకున్న వారిని గుర్తించి ఆపరేషన్ నిమిత్తం పంపేవారి జాబితాను తయారు చేయాలని సూచించారు. గుంతకోడూరు, తాడూరు పరీక్ష కేంద్రాలలో 130 మందికి పరిశీలించి అద్దాలు, మందులు పంపిణీ చేశామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామా సర్పంచ్‌లు యాదమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో బోరు ప్రారంభం



తాడూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో శనివారం సర్పంచ్ యాదమ్మ శ్రీనివాసులు బోరును ప్రారంభించారు. ఆలయ ఆవరణలో బోరు వేసేందుకు ముందుకొచ్చిన సర్పంచ్ ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. సొంత డబ్బులతో బోరు వేసి ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో మేలు చేశారని సర్పంచ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో చింత సత్తి, విద్యాకమిటీ చైర్మన్ కురుమయ్య, కురుమూర్తి, రాములు, జంగయ్య, చెన్నయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల పల్లగుట్టపై వెలసిన దర్గాలో ఐక్యత ఫౌండేషన్ ఎక్జిక్యూటీవ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి ప్రార్థనలు జరిపారు. అనంతరం గ్రామంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, యాదయ్య, ప్రసాద్, పాండు, చంద్రమౌళి, శకీల్, జమాలుద్దీన్, శ్రీపతిరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార యాత్ర

నాగర్‌కర్నూల్‌రూరల్: ఫిబ్రవరి 28 నుంచి మార్చ్ 4వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బహుజన రాజ్యాధికార యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కుమార్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ యాత్రలో పాల్గొంటారని, ఈ యాత్ర ద్వారా అసెంబ్లీలో బహుజనులకు రాజ్యాధికార కాంక్షను నిలుపుతామని అన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే 10 లక్షల ఉద్యోగాల నియామకాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పృథ్వీరాజు, పరుశరాములు, అంతటి నాగన్న, పసుపుల రామకృష్ణ, రాంచందర్, రమేష్, వెంకటేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.